ప్రజాశక్తి

బుధవారం 23 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఇదే పెరల్ డిస్టలరీ

'మాగుంట'కు చెందిన పెరల్ డిస్టలరీలో

సిఐడి సోదాలు

- ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు
- గత వైసిపి ప్రభుత్వంలో 'మద్యం' అక్రమాలపైనే ఈ విచారణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి చెందిన పెరల్ డిస్టలరీలో సిఐడి అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఉదయం డిస్టలరీలోకి వెళ్లిన అధికారులు రాత్రి వరకు తనిఖీలు చేపట్టారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం షాపులు నిర్వహించారు. అలా మద్యం షాపులు నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని వైసీపీ ప్రభుత్వ పెద్దలు మింగేశారన్న ఆరోపణలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం సిఐడి విచారణ వేసింది. మంగళవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా మద్యం తయారీ ఫ్యాక్టరీలపై సిఐడి అధికారుల బందాలు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వంలో వైసిపి ఎంపీ, ప్రస్తుతం టిడిపి ఎంపీ అయిన మాగుంట శ్రీనివాసులరెడ్డికి చెందిన శింగరాయకొండ లోని పెరల్ డిస్టలరీ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏపీ సిఐడి ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగు తున్నాయి.

ఏపీ సిఐడి డి.ఎస్.పి జి.శ్రీనివాసరావుతో పాటు ఇద్దరు సిఐలు, నలుగురు ఎస్ఐల ఆధ్వర్యంలో ఉదయం పది గంటల నుంచి రాత్రి వరకు పెరల్ డిస్టలరీలో రికార్డులను పరిశీలిస్తున్నారు. ఉదయం సిఐడి అధికారులు ఫ్యాక్టరీలోకి వెళ్లే సమయంలో స్థానిక పోలీసులను అక్కడ సెక్యూరిటీగా ▶ 2లో

జడ్పీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు స్వామి, గొట్టిపాటి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజా సమస్యలపై

సమగ్ర చర్చ..

- సమష్టి కృషితో జిల్లా అభివృద్ధి
- గ్రామ సభల్లో అర్జులకు పెంచన్ను
- రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి, స్వామి
- కళకళలాడిన జడ్పీ సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రజాసమస్యల పరిష్కార వేదిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశంలో చానాళ్ల తర్వాత ప్రజాసమస్యలపై సమగ్ర చర్చ జరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన రెండో సమావేశంలో రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితో పాటు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్న జడ్పీ సర్వసభ్య సమావేశంలో పలు శాఖలపై అర్ధవంతమైన చర్చలు జరిగాయి. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటిసి సభ్యులు, ఎంపిపిలు అడిగిన ప్రశ్నలను మంత్రులు సావధానంగా విన్నారు. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు అధికారుల ద్వారా సమాధానాలు రాబట్టారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని మంత్రులు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర సర్వతోముఖాభివద్ధికి, ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి వుందని, సమిష్టి కృషితో జిల్లా అభివృద్ధికి కంకణ బద్ధులు కావాలని రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజయస్వామి పిలుపునిచ్చారు. పాత జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

తొలుత ఇటీవల మరణించిన గుడ్లూరు జడ్పీటిసి సభ్యులు కె.బాపిరెడ్డి మతికి సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, వ్యవసాయం, ఉద్యాన శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గహ నిర్మాణ శాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించిన ఎజెండా అంశాలపై చర్చించగా, పలువురు జడ్పీటిసి, ఎంపీపీలు పలు సమస్యలను మంత్రులు, జిల్లాపరిషత్ చైర్ పర్సన్, ▶ 2లో

48 గంటల్లోనే నిందితుల అరెస్టు

- బంగారం వ్యాపారి నగదు దోపిడీ కేసును ఛేదించిన బాపట్ల జిల్లా పోలీసులు
- నలుగురు ముద్దాయిల అరెస్టు
- రూ.39 లక్షల నగదు, స్విఫ్ట్ డిజైర్ కారు స్వాధీనం

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి తుషార్‌డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని కోరిశపాడు సమీపంలో ఉన్న ఎమర్జెన్సీ లాండింగ్ పాయింట్ వద్ద రెండు రోజుల క్రితం జరిగిన దారి దోపిడీ ఘటనకు సంబందించిన కేసును 48 గంటల్లోనే పోలీసులు ఛేదించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.39 లక్షల నగదు, నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎస్పి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దారిదోపిడీ కేసు వివరాలను ఎస్పి తుషార్ డూడి వెల్లడించారు.

గుంటూరు పట్టణంలోని సాయిరామకష్ణ జ్యూయలరీ షాపునకు చెందిన తల్లం స్వరూప్‌కుమార్ చెన్నైలో బంగారం కొనడానికి తన స్నేహితుడు, డ్రైవర్ కూడా అయిన శ్రీనివాసరావుతో కలిసి ఐచర్ లారీ వాహనంలో గుంటూరు నుండి అక్టోబర్ 18న రాత్రి బయలుదేరారు. అక్టోబర్ 19న అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో జాతీయ రహదారి-16లో కోరిశపాడు ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న ఎమర్జెన్సీ ల్యాండింగ్ సెంటర్ వద్ద నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు నెంబర్ లేని కారుతో ఐచర్ వాహనాన్ని అకస్మాత్తుగా అడ్డుకున్నారు. వాహనంలో వున్న స్వరూప్ కుమార్‌ను బలవంతంగా కిందికి దించి కర్రల సంచిలో వున్న రూ.39.50 లక్షల నగదు, ఫిర్యాది మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నారు. అతడిని తమ కారులో ఎక్కించుకొని ఒంగోలు వైపు కొంతదూరం వెళ్లి స్వరూప్‌కుమార్‌ను దించి ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించి వెళ్లిపోయారు. బాధితుడు మేదర మెట్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చెయ్య డంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పీ పి.జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బందాలు దర్యాప్తు ప్రారంభించాయి. పోలీస్ అధికారులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కొని, టోల్ గేట్‌ల వద్ద వున్న సమాచారం, సిసి టివి ఫుటేజ్‌ల ఆధారంగా, ప్రత్యక్ష సాక్షులు చెప్పిన కథనాన్ని బట్టి.. ముద్దాయిలను గుర్తించి అరెస్టు చేశారు. నేరస్తులందరూ కష్ణా జిల్లా, ఉయ్యూరు మండలం, కాటూరు పంచా యతీ, బీసీ కాలనీకి చెందినవారు. ప్రధాన నిందితుడైన ధనికొండ వెంకన్నస్వామి డ్రైవర్ కాగా అతని తల్లికి రెండు కిడ్నీలు పాడవడంతో ఆమె మంచంలోనే ఉంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల సులువుగా డబ్బులు ▶ 2లో

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ నాగేశ్వరరావు

రోడ్డు ప్రమాదాల నివారణపై

ప్రత్యేక దృష్టి

- వాహనదారులకు అవగాహన కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రహదారి ప్రమాదాల నివారణపై వాహనదారులకు మరింత అవగాహన కల్పించడంపై మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం ఆమె అధ్యక్షతన ప్రకాశం భవనంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్స్, రహదారుల ఆక్రమణ వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. శింగరాయకొండ వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై విమానాల ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం నిర్మించిన స్ట్రెచ్‌లో అధికంగా ప్రమాదాలు జరుగుతుండటంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేయడానికి విమానయాన శాఖ నుంచి ప్రత్యేక అనుమతులు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెప్పగా, ప్రమాదాల నివారణకు ఆ స్ట్రెచ్‌లో ప్రత్యామ్నాయంగా వాటర్ బ్యారికేడ్స్, రేడియం స్టిక్కర్లు, ఇల్యూమి నేషన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. ఇతర రహదారుల లోనూ డివైడర్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని, వీధి వ్యాపారులు రహదారులను ఆక్రమించకుండా చూడాలని అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులలోకి కలుస్తున్న సర్వీసు రోడ్లలో అవసరమైన స్పీడు బ్రేకర్లు ▶ 2లో

ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమావేశంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటిసిలు, ఎంపిలు పలు సమస్యలను ప్రస్తావించారని, ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి పేదవానికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కషి చేస్తుందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి.. సంక్షేమ ఫలాలు నిజమైన లబ్ధిదారునికి అందేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా ఇసుక ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, అభివద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చెరువుల వద్ద ఉన్న జంగిల్ క్లియరెన్స్, చెరువులో మట్టి తీసి పొలాలకు వేయటం, క్రీడామైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను ఆదేశించామన్నారు. నిర్మాణంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఇళ్ళ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను ఖాళీ చేయించి కొత్త భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించామన్నారు. జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎపిసిపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు. 132 కెవి, 220 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు అధ్యయనం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

పంటల ఎన్యుమరేషన్‌కు చర్యలు

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల ఎన్యుమరేషన్‌కు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు వయోవృద్ధులు, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంట వివరాలను క్షేత్ర స్థాయిలో అంచనాలు తయారు చేయడం, రైతాంగానికి అవసరమైన ఎరువులు సలహాలు సూచనలు ఇవ్వడం చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. భారీ వర్షాల కారణంగా అంటు వ్యాధులు ప్రబల కుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు శాతం పెరిగేలా, మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రైవేట్ బ్లడ్‌బ్యాంకుల నుండి ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన బ్లడ్ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలా అభివద్ధే లక్ష్యంతో ఉపాధి హామీ చట్టం ద్వారా అవసరమైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంతో 200 కోట్ల రూపాయలకు పైగా సిసి రోడ్లు, సైడు కాలువలు, క్యాటిల్ షెడ్స్ వంటి పనులను పెద్దఎత్తున చేపట్టామన్నారు. సభ్యులు కోరిన విధంగా ప్రతి మండలంలో సదరన్ క్యాంపులు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతిఒక్కరికీ మెడికల్ సర్టిఫికెట్స్ జారిచేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గ్రామ సభలు నిర్వహించి అర్హత కలిగిన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, దర్శి, కందుకూరు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఇంటూరు నాగేశ్వరరావు, బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా పరిషత్ సిఇఒ బి. చిరంజీవి, డ్వామా, డి.ఆర్.డి.ఎ, వ్యవసాయ, వైద్య ఆరోగ్య శాఖ, గహ నిర్మాణ, విద్యుత్ శాఖలకు సంబంధించి ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాలకు చెందిన అధికారులు, జడ్పీటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

48 గంటల్లోనే నిందితుల అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

సంపాదించాలని ఎక్కడైనా దొంగతనం చేద్దామనుకున్న వెంకన్న స్వామి ఇదే విషయం తన ముగ్గురు స్నేహితులైన పగడాల మహేష్, టెంటు కార్తీక్, పూరేటి శివ శ్రీనివాసరావుకు చెప్పారు. వారు కూడా అంగీకరించడంతో నలుగురూ కలిసి దోపిడీ చేసి వచ్చిన డబ్బులతో జీవితంలో స్థిరపడదామను కున్నారు. చెన్నై వెళ్లి బంగారం కొనుగోలు చేసే వారు నగదుతో వెళతారని, వారిని గుర్తించి దోపిడీ చేద్దామని భావించారు. ఈ మేరకు విజయవాడలోని ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకున్నారు. విజయవాడ వెంకటరమణ ట్రావెల్స్‌కు చెందిన ఐచర్ లారీని విజయవాడ నుంచి ఫాలో అవుతూ గుంటూరులో బాధితుడు కర్రల సంచితో లారీ ఎక్కడం గమనించారు. నిర్మానుష్య ప్రదేశంలో ఐచర్ లారీ ఆపుదామని బావించి ఈ నెల 19న అర్ధరాత్రి ఒంటి గంటకు కొరిశపాడు ఫ్లైఓవర్ దగ్గరలో ఐచర్ లారీకి కారును అడ్డంగా పెట్టి టార్చ్‌లైట్‌తో రోడ్డు పక్కకు ఆపించారు. డ్రైవర్‌ను, బాధితుడిని బెదిరించి కొట్టి.. బాధితుడిని వారి కారులో బలవంతంగా ఎక్కించుకొని అతని సంచిలో ఉన్న రూ 39.50 లక్షల నగదు, మొబైల్‌ను దోచుకొని.. కొంత దూరం వెళ్లిన తర్వాత అతడిని విడిచి పెట్టారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంలో పోలీసులు 48 గంటల్లోనే నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసు ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్.ఐ షేక్ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్.ఐ వై సురేష్, జె.పంగులూరు ఎస్.ఐ బి వినోద్ బాబు, మేదరమెట్ల ఏ.ఎస్.ఐ షేక్ మహమ్మద్, కానిస్టేబుల్స్ కె తిరుపాల్ రెడ్డి, ఎన్ రమేష్ బాబు, ఎన్ అశోక్, డి అంకమ్మరావు, జి సురేష్, డ్రైవర్ శ్రీనివాస యాదవ్, హోమ్ గార్డ్ ఎమ్.ప్రభాకర్‌ను ఎస్‌పి అభినందించారు. రివార్డుగా నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్, అద్దంకి రూరల్ సర్కిల్ సిఐ డి. మల్లికార్జున, సిసిఎస్ సిఐ ప్రేమయ్య, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పోలీసులు, వైద్యులు, ఇతర అధికారులు ఐ-ర్యాడ్ యాప్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రోడ్లపైకి ఆవులు, ఇతర పశువులను వదులుతున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో మున్సిపాలిటీ, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మర్రిచెట్లపాలెం నుంచి చీమకుర్తి వరకు దెబ్బతిన్న రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టడానికి క్వారీల యజమానుల సహాయం తీసుకోవాలని ఆర్అండ్‌బి, గనుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పి కె.నాగేశ్వరరావు, డిటిసి ఆర్.సుశీల, జి.జి.హెచ్. సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాదేవి, ఆర్. అండ్ బి. ఎస్.ఈ. దేవానందం, డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ డి.సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎపిఎస్ ఆర్టీసి ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు, రవాణా శాఖ సిఐలు, మున్సిపల్ అధికారులు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఐడి సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉంచారు. ఎవరినీ లోపలికి అనుమతిం చకూడదని ఆదేశించారు. ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి సిఐడి అధికారులతో లోపలికి వెళ్లి 10 నిమిషాల తర్వాత ఫ్యాక్టరీలో నుంచి బయటికి వచ్చారు. ఈ ఫ్యాక్టరీ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డికి చెందినది కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు సిఐడి అధికారులు తనిఖీలు చేయడం రాజకీయవర్గాల్లో చర్చకు తావిచ్చింది.

క్రమశిక్షణతో నడుచుకోవాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

గ్రామాలలో అల్లర్లు సృష్టించకుండా క్రమశిక్షణ కలిగి నడుచుకోవాలని హనుమంతుని పాడు ఎస్ఐ మాధవరావు అన్నారు. మంగళవారం నాడు గతంలో పలు కేసులు సంబంధించి రౌడీ షీటర్లుగా నమోదైన వారికి స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. No: 18/2023
IN
O.S.No: 371/2016

ముండ్లమూరి వెంకటరామయ్య .....D.H.R
V/s
శ్రీ నారాయణ స్వామి రా - బాయిల్డ్ రైస్ మిల్,
రిప్రజెంటెడ్ బై మేనేజింగ్ పార్టనర్
ముసులూరి సత్యనారాయణ వగైరాలు ....J.D.Rs

NOTICE, U/or 21R 66 Of CPC

To
R3) ముసులూరి సురేష్ బాబు
S/o లేటు అంజయ్య, తిమ్మన్నపాలెం (గ్రామం)
కొరిశపాడు (మండలం), బాపట్ల జిల్లా.

D.H.R తనకు డిక్రీ ప్రకారం రావలసిన మొత్తమును నీతాలూకు తిమ్మన్నపాలెం గ్రామ సర్వేనెంబర్ 454లో AC. 2.00 భూమిని వేలం వేయుట ద్వారా వసూలు పరిపించమని కోరుచూ పై నంబర్ E.P దాఖలు చేయగా, నీ నోటీసు నిమిత్తం 28-11-2024కి వాయిదా వేయబడినది. ఆరోజు నీవు పైకోర్టు ఎదుట ఉదయం 10.30 ని.లకు హాజరై నీ అభ్యంతరములు తెలుపగలవు.లేనిచో నీ పరోక్ష మందు కోర్టు వారు ఉత్తర్వులు ఇవ్వగలరు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా తేది : 28.11.2024
అద్దంకి :21-10-2024 **ఇట్లు**
వెలగపూడి సుబ్రహ్మణ్యం
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
అద్దంకి.

నోటీసు
మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), నరసరావుపేట
ఓ.యస్.నెం.37/2020

గోరంట్ల సాయి ప్రసన్న ...వాది
వర్సెస్
గోరంట్ల రామాంజనేయులు వగైరాలు ...ప్రతివాదులు
టు
డి10: చింతిరాల శ్రీనివాసరావు తండ్రి శేషయ్య, నివాసము ఏల్చూరు గ్రామము, సంతమాగులూరు మండలం, ప్రకాశం జిల్లా.
డి13: కోట్ల లక్ష్మి కుమారి భర్త.అంజిరెడ్డి, కురిచేడు గ్రామము, దర్శి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో పై కోర్టు వారి నుండి మీకు దావా నోటీసులు జారీ చేయగా మీరు దావా నోటీసులు తీసుకోని కారణముగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తము ది.01-11-2024కు వాయిదా అయ్యి ఉన్నది. కావున వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట మీరు ది.01-11-2024వ తేదీ ఉ॥10-30ని॥లకు, మీరు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న తెలుపు కోవలసినది. లేనియెడల, దావా మీ పరోక్షమందు, చట్టప్రకారము తీర్మానము చేయబడును. కావున తెలియజేయడమైనది.

బై కోర్టు ఆర్డర్
వాయిదా:01-11-2024

ఇట్లు
శ్రీ బి.అనిల్ కుమార్,
వాది తరుపు అడ్వకేట్,
నరసరావుపేట.

మహారాజశ్రీ ఒంగోలు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 672/2022
IN
O.S.No.1291/2022

Between :-
దోమల వెంకటేశ్వర్లు ...... వాది
మరియు
సిరికొండ బ్రహ్మయ్య .... ప్రతివాది

To:
సిరికొండ బ్రహ్మయ్య,
తండ్రి రామకోటయ్య, హిందువు,
వయస్సు 45 సం.లు, వ్యాపారం,
డోర్ నెంబర్ 9-102/1, 2, తూర్పు బజారు,
గిన్నెలస్వామి రోడ్డు, రెవిన్యూ వార్డు నెం.9,
చీమకుర్తి గ్రామం, చీమకుర్తి మండలం,
ప్రకాశం జిల్లా.

పై నంబరు దావాలో మరియు పై ఐ.ఎ. నందు ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టుద్వారా నోటీసు పంపిన తీసుకోనందున గౌరవ కోర్టువారు మీకు నోటీసులు జారీచేయు నిమిత్తము తేది:01-11-2024కు వాయిదా వేసి మీకు నోటీసును పేపర్ ప్రకటన ద్వారా తెలియపరచవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు పై తెలిపిన కోర్టులో స్వయముగా గానీ, లేదా ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియపరచు కొనవలసినది, లేని యెడల మీపరోక్షమున పై దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది 22-10-2024. **ఇట్లు**
పి.శ్రీనివాసులు,
హై కోర్టు న్యాయవాది, రూం నెం.11,
ఎ-బ్లాక్, అడ్వొకేట్ ఛాంబర్స్.
జిల్లా కోర్టు ప్రాంగణము,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.

కోర్టు నోటీసు
In the Court of the senior civil judge at Bapatla.
S.O.P. No: 81/2024.

Between:
Budda Dhanush .... Petitioner
and
The head post master, head post office Bapatla.Bapatla district And others
...respondents

ఈనెంబరులో పిటీషనర్ ,రెస్పాండెంట్స్ పైవారసత్వ సర్టిఫికెట్ కొరకు ఈనంబరు S.O.P దాఖలు చేసుకొనియున్నారు. వాయిదా:04-11-2024 తేదీన కు అయియున్నది. ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల శ్రీ బాపట్ల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టుకు హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల పిటిషనర్‌కి అనుకూలముగా తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది : 04-11-2024.

ఇట్లు
పిటిషనర్స్ తరుపు న్యాయవాది
లంబు సాంబయ్య,
అడ్వకేట్, బాపట్ల.
సెల్ : 9346779763.

మహారాజశ్రీ, ఒంగోలు అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P. 51/2024

బిట్వీన్
యామన జయలక్ష్మి ... పిటిషనర్
వర్సెస్
యామన చిరంజీవి ... ప్రతివాది
టు
యామన చిరంజీవి, తండ్రి వెంకటేశ్వర్లు
R/o సూరారెడ్డి పాలెం గ్రామం
టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా.

పైన ఉదాహరించిన పిటిషనులో గౌరవ కోర్టు వారు నోటీసు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున గౌరవ కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. కాబట్టి తేదీ 11-11-2024 న ఉదయం గం.10-30 ని.లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడర్ గారి ద్వారా గాని పైన తెలిపిన కోర్టు ముందు హాజరై, మీయొక్క ఆక్షేపణలు తెలుపవలసినది. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ 11-11-2024
ఉదయం గం.10-30 ని.లకు **ఇట్లు**
చీరాల మురళి
న్యాయవాది, ఒంగోలు
సెల్ : 9550649899

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), నరసరావుపేట
ఐ.ఏ.నెం. 06/2024 in O.S. No. 37/2020

గోరంట్ల సాయి ప్రసన్న .... పిటీషనర్/వాది
V/s
గోరంట్ల రామాంజనేయులు వగైరాలు
...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు
To,
ఆర్ 10: చింతిరాల శ్రీనివాసరావు S/o శేషయ్య, నివాసము ఏల్చూరు గ్రామము, సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా.
ఆర్ 13: కోట్ల లక్ష్మి కుమారి W/o అంజిరెడ్డి, కురిచేడు గ్రామము, దర్శి మండలం, ప్రకాశం జిల్లా.
ఆర్18: చింతిరాల అనంత వెంకట నాగ పూర్ణచంద్రరావు S/o వెంకటేశ్వరరావు, టీచర్, ఏల్చూరు గ్రామము, సంతమాగులూరు మండలం, బాపట్ల జిల్లా.
ఆర్26 : చల్లా చిన్న అంజిరెడ్డి S/o నాగిరెడ్డి, తనుబొద్దివారిపాలెం గ్రామము, యద్ధనపూడి మండలం, బాపట్లజిల్లా.

పై నెంబరు దావాలో ఐ.ఎ.నెం. 06/2024 నెంబరున పిటీషన్ దాఖలు చేయగా, పై కోర్టు వారి నుండి మీకు నోటీసులు జారీ చేయగా మీరు నోటీసులు తీసుకొని కారణముగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తము ది. 01-11-2024 వాయిదా అయ్యి ఉన్నది. కావున వాయిదా రోజు పై కోర్టు వారి ఎదుట మీరు ది. 01-11-2024 వ తేదీ ఉదయం 10-30 ని॥ లకు, మీరు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని లేదా వకీలు ద్వారాగాని హాజరై మీకు ఆక్షేపణలు ఉన్న తెలుపు కోవలసినది. లేనియెడల, మీ పరోక్షమందు, చట్ట ప్రకారము తీర్మానము చేయబడును. కావున తెలియ జేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
వాయిదా: 01-11-2024

ఇట్లు.
శ్రీ బి.అనిల్ కుమార్,
పిటీషనరు తరుపు అడ్వకేట్,
నరసరావుపేట.

ప్రజాశక్తి 3
బుధవారం 23 అక్టోబర్ 2024

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

మస్టర్ పాయింట్ వద్ద నిరసన

మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మార్కాపురంలో తొలగించిన ఇంజినీరింగ్ కార్మికులను, గిద్దలూరులో కోవిడ్ కార్మికులను విధులలోకి తీసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను తొలగించటాన్ని ఖండిస్తూ మస్టర్ పాయింట్ వద్ద మంగళవారం కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేసే పని ఎవరూ చేయలేరని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2న గాంధీ జయంతి రోజున మున్సిపల్ కార్మికులందరికీ సన్మానం చేసి ఎలాంటి రాజకీయ కక్ష సాధింపులు ఉండవని చెప్పిందన్నారు. నేడు మున్సిపల్ కార్మికులపై రాజకీయ కక్ష కొనసాగిస్తూ ఏళ్ళ తరబడి పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు కడుపు కొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈనెల 9 నుంచి కార్మికుల ఆందోళన చేస్తుంటే. స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు పట్టి పట్లనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. వారి సమస్య పరిష్కారం చేయకపోతే మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.విజయమ్మ, రాష్ట్ర నాయకురాలు యు.రత్నకుమారి, కె.సామ్రాజ్యం, అక్కేశ్వం ొరావు, మొండెం బాబు, బి.సుబ్బారావు, బి.కోటేశ్వరరావు, ఎద్దు రవికుమార్, అన్నపూర్ణ, చిన్నబ్బాయి, బి.దివ్య, కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక

యర్రగొండపాలెంలో
నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ఎన్ఎసి శిక్షణ కేంద్రంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 22 మంది ఉద్యోగాలు సాధించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఇన్నోవా సోర్స్, ఎస్‌బిఐ కార్డ్స్, నవభారత్ ఫర్టిలైజర్స్, కళ్లం టెక్స్‌టైల్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన యువతీ యువకులు జాబ్ మేళాలోపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ పక్రాశం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ మార్కాపురం ఇన్‌ఛార్జి ఫిరోజ్ గాంధీ, ఎంప్లాయి మెంట్ కార్యాలయం యంగ్ ప్రొఫిషనల్ డి.రమేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ వినోద్ పాల్గొన్నారు.

34 మందికి ఉద్యోగాలు కల్పన

యర్రగొండపాలెం : యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో అమర్‌రాజా, సోలార్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు మొత్తం 65 మంది హాజరయ్యారు. అందులో 34 మంది ఉద్యోగాలు ఎంపి కయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా శ్రీధర్ నాయుడు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.ప్రదీప్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.విజయ కుమారి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ షేక్ ఈష్ బాషా, అమర్‌రాజా, సోలార్ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

గుండె పోటుతో వాలీబాల్ మాజీ క్రీడాకారుడు మృతి

ఏలీషా(ఫైల్)

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన వాలీబాల్ మాజీ క్రీడాకారుడు గుంతోటి ఏలీషా గుండెపోటుతో సోమవారం రాత్రి మతి చెందాడు. ఏలీషా హైస్కూల్ స్థాయి నుంచే వాలీబాల్ క్రీడాకారుడిగా మంచి గుర్తింపు పొందాడు. తోటి క్రీడాకారులతో సమన్వయంతో మెలిగి తన జూనియర్స్‌కు శిక్షణ ఇచ్చేవాడు. తన ఇద్దరు పిల్లలకు చదువు, క్రీడల్లో శిక్షణ ఇచ్చాడు. పెద్దకుమారుడు సిటిజన్ వెయిట్ లిఫ్టింగ్ లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా తీర్చిదిద్దాడు. రెండో కుమారుడు రాంకీ జూనియర్ కళాశాల ప్రథమ స్థానంలో నిలిచాడు. ఏలీషా మృతి గురించి తెలుసుకున్న తోటి మాజీ క్రీడాకారులు, స్నేహితులు బందువులు అభిమానులు ఆయన మతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళలర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వాలీబాల్ మాజీ క్రీడాకారులు పాలపర్తి యానాది, బాలిశెట్టి నాగేశ్వరరావు, పశుపులేటి వెంకటరమణ, కోయి నాగార్జున, స్నేహితులు బంధువులు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- పొన్నలూరు

ద్విచక్ర వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని పొన్నలూరు ఎస్ఐ అనుక్ తెలిపారు. హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహన చోదకులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షేమంగా బయట పడవచ్చునని తెలిపారు. మద్యం తాగి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

టంగుటూరు : టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద శింగరాయకొండ సిఐ హజరత్తయ్య, ఎస్ఐ నాగమల్లీశ్వరరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్, లైసెన్స్, రాష్ డ్రైవింగ్ చేస్తున్న వారి అదుపులోకి తీసుకున్నారు. వారికి రూ.15,300 జరిమానా విధించారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ హజరత్తయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై గుంతలను పూడ్చుతున్న పల్లెపాలెంయూత్

రహదారిపై గుంతలకు మరమ్మతులు

ప్రజాశక్తి కొమరోలు

మండల పరిధిలోని పామూరు పల్లెపాలెం శివాలయం వద్ద రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన పామూరు పల్లెపాలెం యూత్ సభ్యులు స్వచ్ఛందంగా గుంతలను పూడ్చారు. వాహనచోదలకు తాత్కాలికంగా ఇబ్బందులు లేకుండా చేశారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్లలోని అంబేద్కర్ గురుకుల, కెజిబివి పాఠశాలలను ఎంఇఒలు గిరిధర శర్మ, కోటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, భోజనం మెనూ అమలు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల నిర్వహణపై సలహాలు సూచనలు చేశారు.

తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి-రాచర్ల

తహశీల్దారు ఎల్. వెంకటేశ్వర్లును జాతీయ బీసీ చైతన్య సమితి రాష్ట్ర కార్యదర్శి కె.రంగస్వామి అధ్వర్యంలో శ్రీనెమలి గుండ్లరంగనాయకస్వామి దేవస్థానం కళ్యాణ కట్ట సిబ్బంది మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.బీసీలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని తహశీల్దారును వారు కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్ఐ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సైబర్ నేరాల పట్ల ప్రజలు, యువత అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ చౌడయ్య తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కెవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించ వద్దని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని తెలిపారు. తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెప్తూ బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, రుణాలు ఇస్తామని, ఇతరత్రా ఆశచూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎర వేస్తారని తెలిపారు. అలాంటి వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించ వద్దని ఆయన పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎంపిడిఒ మహాలక్ష్మి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ వై. మహాలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులకు సీజనల్ వ్యాధుల నివారణ, శానిటేషన్ పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహిఁచారు. ఈ సందర్భంగా ఎండిపిఒ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు అధికంగా పడినందున గ్రామాల్లో పారిశుధ్యం పేరుకు పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది నిత్యం గ్రామాల్లో పర్యటించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు. నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఓనారియల్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతవరం వైద్యాధికారి డ్టార్ కులదీప్ , ఆర్‌డబ్ల్యుఎస్ ఎఒ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు,ఎఎన్ఎంలు అంగన్ వాడీ సూపర్ వైజర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం : సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు తీసుకోవాని ఈతముక్కల ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి. శివ పార్వతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పార్వతి మాట్లాడుతూ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఎఒ బి. శ్రీనివాసులు, ఇఒఆర్‌డి వేణు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బండారు శ్రీనివాసులు, వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కోటా నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్డఇ ఈదుల రాజశేఖర్‌రెడ్డి, ఎంఇఒలు ఆంజనేయులు, మల్లు నాయక్, ఎపిఒలు నాగేశ్వరరావు, శైలజ, పంచాయితీ రాజ్ ఎఒ రవీంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కొన్ని దశాబ్దాలపైగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు గ్రామాల్లోని పొదుపు మహిళా సంఘాలు మహిళలు క్షేత్రస్థాయి లో కషి చేయాలని వెలుగు డిఆర్‌డిఎ ఎపిఎం బత్తుల నరేంద్ర కుమార్ కోరారు. బాపట్ల, ప్రకాశం ఉమ్మడి జిల్లాల హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, హెల్ప్ సేవా సంస్థ టిఐ ప్రాజెక్టు డైరెక్టర్ బివిజసాగర్ ఆధ్వర్యంలో మీకు తెలుసా ఐఇసి హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నాగులప్పలపాడు హెల్ప్ టిఐ అవుట్రిచ్ వర్కర్ మల్లేశ్వరి అధ్యక్షతన మహిళా సంఘాల సమైక్య అధ్యక్షులు, విఒఎలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిసిలు రామకష్ణ, అరుణ, కవిత, పిఇలు దివ్య, నాగలక్ష్మి, మండల సమైక్య అధ్యక్షులు విఒఎలు. డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలబాలికలతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో మండలంలోని చెరువుజమ్ములపాలెం జడ్పీ పాఠశాలలో ఇటీవల నిర్వహించిన బాలబాలికల హాకీ అండర్-14, అండర్-17 క్రీడల్లో చెరువు జమ్ములపాలెం హై స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-17 బాలుర విభాగంలో విజేతలుగా, అండర్-14 బాలుర విభాగంలో విజేతులుగా నిలవగా, అండర్-17, అండర్-14 బాలికల విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. వచ్చేనెల 3, 4, 5 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన వారి వివరాలను పాఠశాల పిఇటి బి.వీరచంద్ర ప్రకటించారు. ఎంపికైన వారిలో బాలుల విభాగంలో వై.శరత్‌బాబు, ఎస్‌కె.సాయిషబ్బీర్, జె.సాద్విక్, ఎన్.నరేష్, ఎం.సిసింద్రీ, బాలికల విభాగంలో బి.అనురాధ, ఎస్‌కె చాందిని, కె.మరియమ్మ, టి.శాంతి, వి.రేణుక ఉన్నారు. వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో అనకాపల్లిలో జరిగే అండర్-14 పోటీలకు ఎంపికైన వారిలో బాలుర విభాగంలో వి.విక్టర్‌పాల్, కె.సుదర్శన్, కె.సంపత్, ఎస్.జస్వంత్, వి.రత్నం, జె.వెంకటేష్, బి.మణికంఠ, బాలికలు విభాగంలో బి.ఝాన్సీ. బి.దివ్య, ఎం.వరలక్ష్మి, కె.సుప్రజ, జి.దివ్య, డి.గౌతమి ఉన్నారు. వీరిని హెచ్‌ఎం వివి.కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నిరసన తెలియజేస్తున్న గ్రామస్థులు

మద్యం షాపు వద్దని నిరసన

ప్రజాశక్తి-మేదరమెట్ల

మద్యం షాపు మా గ్రామంలో వద్దని తిమ్మన పాలెం గ్రామ ప్రజలు మంగళవారం నిరసన చేపట్టారు. మద్యం దుకాణానికి ఎదురుగా చర్చి ఉందని, మరో ప్రాంతంలో మద్యం షాపును ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రజలు రోడ్డు ఎక్కి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తిభావంతో కూడిన ఈ ప్రాంతంలో కాకుండా మరో ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయాలని ప్రజలు తీర్మానించారు.

రహదారుల వెంట ఖాళీ కొబ్బరిబోండాలు వేయొద్దు

ప్రజాశక్తి - రేపల్లె

మాట్లాడుతున్న కట్ట మంగ

ఖాళీ కొబ్బరి బోండాలు రహదారులు వెంబడి వేయొద్దని రేపల్లె మున్సిపల్ చైర్ పర్సన్ కట్ట మంగ అన్నారు. మంగళవారం రేపల్లెలోని కొబ్బరికాయ వర్తకులతో ఆమె సమావేశం నిర్వహించారు. రహదారుల వెంబడి ఖాళీ బోండాలు పడటం వలన ప్రజలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. వాటిని గోతాలలో నిలువ చేసి మున్సిపల్ ట్రాక్టర్లకు అందజేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాలైన పెనుమూడి పేటేరు, ఆరవపల్లి, నిజాంపట్నం రోడ్లులో వాడిన కొబ్బరి బొండాలను పడవేయడం వలన రేపల్లె పట్టణంలోనికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగటమే కాక పట్టణ ముఖద్వారాలు కొబ్బరి బోండాలతో దర్శనమిస్తున్నాయన్నారు. వర్తకులు పట్టణం పరిశుభ్రతకు సహరించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు సదరు బోండాలను వారికి అందిస్తే దోమలు నిల్వ ఉండే అవకాశము లేకుండా ఉంటుందన్నారు.

మహిళలకు దీపావళి కానుకగా..

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

మహిళా సంక్షేమమే ధ్యేయంగా దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 31వ తేదీ నుండి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 5 సంత కాలతో మేనిఫెస్టో హామీలను అమలు చేశామన్నారు. పింఛన్లు రూ.4 వేలకు పెంపు, అన్నా క్యాంటీన్లు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, డీఎస్సీ నోటిఫికేషన్, స్కిల్ సెన్సెస్‌తో పాటు, ప్రస్తుతం సూపర్ సిక్స్ పథకాల అమలు మొదలు పెట్టిందని చెప్పారు. ఎన్నికల హామీలో భాగంగా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మేలు చేసే సంక్షేమ పథకాలు విషయంలో ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అర్హులైన మహిళలందరికీ పారదర్శక విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈనెల 24 నుంచి బుకింగ్ చేసుకునే ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 31వ తేదీ నుండి గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ తీసుకున్న లబ్ధిదారులకు రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ జమ అవుతుందన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచడంలో ఇలాంటి పథకాలు దోహదం చేస్తాయని అన్నారు. అర్హత గల ఏ ఒక్క లబ్దిదారునికి ఈ పథకం రాలేదనే విమర్శ రాకుండా కట్టుదిట్టంగా కార్యక్రమాన్ని అమలు చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.

బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికలు నిర్వహించాలి

- మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్
- వేటపాలెంలో గ్రంథాలయం సందర్శన

ప్రజాశక్తి-వేటపాలెం

గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న నిమ్మగడ్డ రమేష్

ప్రజాస్వామ్య పరిరక్షణకు బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉందని మాజీ ఎన్నికల కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన వేటపాలెంలోని గ్రంథాలయం సారస్వత నికేతనంను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయము నందు గల వివిధ పుస్తకాలను వివిధ, పత్రికలను పరిశీలించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ గ్రంథాలయంలో వదిలి వెళ్లిన వారి చేతికర్రను తాకి సంతోషం వ్యక్తం చేశారు. లైబ్రరీలో పుస్తకాల భద్రత గురించి తెలుసుకున్నారు. సెక్రటరీ పల్లపోతు వెంకట్, లైబ్రేరియన్ శ్రీవల్లీ గ్రంథాలయ చరిత్రను విశిష్టతను తెలియజేశారు. సందర్శకుల పుస్తకంలో 'స్వాతంత్ర్య ఉద్యమం కళ్ళకు కట్టినట్టు చూపుతోంది ఈ గ్రంథాలయం' అని రాశారు. తన జీవితంలో ఈ గ్రంథాలయ సందర్శన అనేది మరువలేని ఘట్టం, నా చిరకాల కోరిక నెరవేరిందని తెలిపారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో రమేష్ ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు, కార్యదర్శి సుంకర ప్రసాదు, సహాయ కార్యదర్శి నాగాంజనేయులు, రామ సుబ్బారావు, నున్నా శివప్రసాద రావు, కాకరపర్తి చంద్రమోహన్, రావి మస్తాన్ రెడ్డి, రామకృష్ణ, మురళీ కృష్ణ, నాసిక వీరభద్రయ్య, కర్ణ శ్రీనివాసరావు, పోతురాజు, ఉమారెడ్డి రామారావు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న బత్తుల పద్మావతి

పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు కృషి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర సభ్యురాలు బత్తుల పద్మావతి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టేరు. తనిఖీలలో భాగంగా ఆమె పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం, పిల్లల హాజరు పట్టిక, పాఠశాలలోని సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు తప్పని సరిగా బడిలోనే వుండే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు, కొంతమేర చదువులో వెనుకబాటు తనం వలన డ్రాప్ ఔట్స్ పెరుగుతున్నాయన్నారు. ఉమ్మడి ప్రకాశం, బాపట్ల జిల్లాలో చైల్డ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. డిస్ట్రిక్ట్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రతి నెలా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీతో పాటు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కలిసి సమన్వయంతో బాల, బాలికల అభ్యున్నతికి రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రేపల్లె

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రేపల్లె పట్టణ సీఐ ఏ.మల్లికార్జునరావు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మౌంట్ పోర్ట్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో శాంతిభద్రతలు పరిరక్షణ కోసం పోలీసులు కృషి చేస్తున్నారని తెలిపారు.

రైతు బజార్లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉత్పత్తులు నేరుగా విక్రయించుకునే అవకాశం కల్పిస్తూ ఏర్పాటు చేసిన రైతు బజార్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. బాపట్ల పట్టణంలోని ఎన్టీఆర్ కూరగాయల మార్కెట్ వద్ద మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు బజార్‌ను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మతో కలిసి రిబ్బన్ కత్తిరించి మంగళవారం ప్రారంభించారు. రైతులకు మేలు కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. రైతులు పండించుకున్న పంటలు నేరుగా రైతు బజార్లకు తెచ్చుకుని విక్రయించుకోవచ్చన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి రైతు బజార్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలో కూరగాయలు అందించడానికి రైతు బజార్లు ఉపయోగపడతాయన్నారు. గత కొంతకాలంగా మూతపడిన రైతు బజార్లను ప్రభుత్వం తిరిగి ప్రారంభస్తుందని చెప్పారు. రైతు బజార్ వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రహదారిపై ఆక్రమణలు, ఆటంకాలు తొలగించామన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పుట్టినరోజు కావడంతో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కేక్ తెప్పించి రైతు బజార్ ప్రారంభం అనంతరం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిడి జాన్సీరాణి, మార్కెటింగ్ శాఖ ఏడీ రమేష్ బాబు, డీఈఈ పవన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, రైతు బజార్ పర్యవేక్షణ అధికారి జి.ఫణింద్ర, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

ప్రజాశక్తి-వేటపాలెం

మాట్లాడుతున్న చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు

క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుందని చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జేఎన్టీయూ కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల పోటీలతో పాటు యూనివర్సిటీ టీం సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కె జగదీష్ బాబు మాట్లాడుతూ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆదేశాలతో యూనివర్సిటీ ఉత్తర్వుల మేరకు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టైక్వాండో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జేఎన్టీయూ కాకినాడ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్, ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ జి.పి. రాజు ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథులుగా చీరాల రూరల్ సిఐ శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. తమ కళాశాల ఎంబీఏ విద్యార్థి ఖాజావలి కామన్ వెల్త్ క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అనంతరం రూరల్ సిఐ శేషగిరిరావు మాట్లాడుతూ స్పోర్ట్స్ లో పాల్గొనే విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని కలిగి మనోధైర్యంతో ఉంటారన్నారు. అనంతరం టైక్వాండో పోటీలను ప్రారంభించారు. డాక్టర్ జి.పి. రాజు మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ కళాశాల నుండి ప్రతి సంవత్సరం ప్రతిభగల ఉత్తమ క్రీడాకారులు యూనివర్సిటీ స్థాయిలో సెలెక్ట్ అవుతూనే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, వివిధ విభాగాధికారులు, జేఎన్టీయూ యూనివర్సిటీ కోచ్ బి.ధనేశ్వరరావు, టైక్వాండో ఇన్స్ట్రక్టర్ ఎన్.తులసి, ప్రకాశం జిల్లా టైక్వాండో అసోసియేషన్ సయ్యద్ సలావుద్దీన్, షేక్ అబ్దుల్ సలాం, ముఖేష్, ఏ.అఖిల్ పరిశీలకులుగా పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపుల పట్ల అలసత్వం వీడాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్
- మెప్మా ఆఫీసు వద్ద మహిళల ధర్నా



మెప్మా ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మెప్మా అధికారులు డ్వాక్రా గ్రూపుల పట్ల అలసత్వం విడనాడాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. డ్వాక్రా గ్రూపుల నుండి అధిక వడ్డీ వసూలు చేయటాన్ని ఖండిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు మెప్మా కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ఒంగోలు నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ బ్యాంకు, గ్రూపులకు మధ్య ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పట్టీపట్టి నట్టు వ్యవహరించడం సరికాదన్నారు. యూనియన్ బ్యాంక్ కర్నూల్ రోడ్డు బ్రాంచ్ అధికారులు డ్వాక్రా గ్రూపు మహిళ నుండి గత సంవత్సర కాలంగా ఇచ్చిన రుణానికి అవసరానికి మించి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని తెలిపారు. అధిక వడ్డీ వసూలు ఆపకపోతే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం గ్రీవెన్స్ లో జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేయగా బ్యాంక్ అధికారులతో మాట్లాడి అధిక వడ్డీ వసూలును తక్షణమే నిలుపు చేస్తామని మెప్మా పీడీ హామీ ఇచ్చారన్నారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ సమస్య పట్ల ఏమాత్రం స్పందించకుండా బ్యాంక్ నిబంధనలు ఇంతే, ఉంటే ఉండండి.. లేకపోతే వేరే బ్యాంకుకు మారండని మహిళలతో దురుసుగా ప్రవర్తించారన్నారు. మెప్మా అధికారుల మాటను కూడా ఖాతరు చేయకపోవడాన్ని వారు తప్పుపట్టారు. మంగళవారం ధర్నా అనంతరం మరోసారి మెప్మా అధికారులను కలవగా యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అధిక వడ్డీ వసూలు ఆపకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఐద్వా నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా ఒంగోలు నగర నాయకులు కె.రాజేశ్వరి, ఎస్‌డి అమీరున్నీసా, సిఐటియు నాయకులు ఎస్‌డి హుస్సేన్, డ్వాక్రా గ్రూపు మహిళలు వి.కోమలి, నాగలక్ష్మి, ఝాన్సీ, వి. లక్ష్మి, జి.శాంతకుమారి, వి.రమణమ్మ, శ్రీదేవి, వీరమ్మ, సరోజిని పాల్గొన్నారు.

కాలనీలోకి చేరిన నీరు

సప్లయ్ ఛానల్‌కు గండ్లు

భగత్‌సింగ్‌నగర్ కాలనీలోకి చేరిన నీరు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం చెరువుకు నీటిని సరఫరా చేసే సప్లయ్ ఛానల్‌కు గండ్లు పడ్డాయి. పట్టణ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలోకి నీరు చేరింది. కొన్ని గృహాల్లోకి నీరు చేరింది. ఇళ్లలోని వస్తువులు తడిసిపోయాయి. సప్లయ్ ఛానల్ బలహీనంగా ఉందని, మరమ్మతులు చేయాలని పలుమార్లు జలవనరుల శాఖ అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో గుండ్లకమ్మ నది ప్రవహిస్తోంది. ఆ ప్రవాహంలో కొంత భాగం నీరు సప్లయ్ ఛానల్ ద్వారా మార్కాపురం చెరువులోకి నీరు చేరుతోంది. భగత్‌సింగ్ నగర్ కాలనీ ప్రాంతంలో సప్లయ్ ఛానల్‌కు గండ్లు పడటంతో చెరువు చేరాల్సిన నీరు నివాస ప్రాంతాల్లోకి చేరింది. తక్షణమే జలవనరుల శాఖ అధికారులు సప్లయ్ ఛానల్‌కు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

గిద్దలూరు ఏరియా వైద్యశాలలో విచారణ

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

విచారణ చేస్తున్న రషీదాబేగం

గిద్దలూరు ఏరియా వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్‌గా పని చేసిన డాక్టర్ సూరిబాబు (ఇన్‌ఛార్జి డిసిహెచ్‌ఎస్)పై ఆరోపణలు చేస్తూ.. రాచర్ల మండలం అనుమల వీడు గ్రామానికి చెందిన ఆర్‌టిఐ కార్యకర్త యామ సంజయ్ ఏపి వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన వైద్యవిదాన పరిషత్ కమిషనర్ గుంటూరు విజిలెన్స్ డిసిహెచ్‌ఎస్ అధికారి డాక్టరు రషీదాబేగంను ఈ ఆరోపణలపై విచారణ కోసం ప్రత్యేక అధికారిగా నియమించారు. ప్రత్యేక అధికారి డాక్టరు రషీదాబేగం మంగళవారం గిద్దలూరు ఏరియా వైద్యశాలలో విచారణ చేపట్టారు. వైద్యశాల వైద్యులు, వైద్యసిబ్బంది, సంబంధిత బాధితులు, ఫిర్యాదుదారుల తో విడివిడిగా మాట్లాడి.. వారితో రాతపూర్వక స్టేట్మెంట్లు తీసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రషీదాబేగం మీడియాతో మాట్లాడుతూ సూరిబాబుపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరుపుతున్నామన్నారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం తగు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

అయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అయోడిన్ లోప రుగ్మతలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సిడి నోడల్ అధికారి, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ భగీరథి పేర్కొన్నారు. ఒంగోలు రాంనగర్ హైస్కూలులో అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోడిన్ లోప వ్యాధులపై విద్యార్థులకు అవగా హన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, హెడ్ మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రవిశంకర్‌కు మద్దతు తెలుపుతున్న నాయకులు

కంది రవిశంకర్‌కు మద్దతు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనసేన పార్టీలో చేరిన సందర్భంగా మంగళవారం ఒంగోలులోని రవి ప్రియమాల్‌లో రవిశంకర్ గ్రూప్ అధినేత కంది రవిశంకర్‌ని కలిసి 50 మంది కాపు నాయకులు కలిసి తమ మద్దతు తెలియజేశారు.

మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

వయోజనులకు విద్యాబోధనతో అక్షరాస్యత శాతం పెంచేలా చర్యలు

సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వయోజనులకు విద్యాబోధనతో అక్షరాస్యత శాతం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వయోజన విద్యపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్లో జరిగింది. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ (జీవన పర్యంతరం విద్య అవకాశాలను అందించడం) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. అక్షరాస్యత లేని మహిళలను గుర్తించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 15,268 మంది నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు, వంటవారు, సహాయకులు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్వాడి సహాయకులలో గుర్తించి విద్యాభ్యాసం చేయాలన్నారు. ఇదే క్రమంలో విద్యావంతులైన వారిని వాలంటీర్ టీచర్లుగా నియమించాలన్నారు. ప్రతి వాలంటీర్ టీచర్‌కు పది మంది అభ్యాసకులను మ్యాపింగ్ చేసి ఉల్లాస్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. టీచర్లుగా ఎంపిక చేసిన వాలంటీర్లకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు జరపాలన్నారు. సామాజిక, ఆర్థిక డిజిటల్ అక్షరాస్యత పెంపొందించేలా అధికారులు సమన్వయంతో కషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య ఉపసంచాలకులు బి జగన్ మోహన్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ మధుసూదన్ రావు, డిపిఓ ప్రభాకర్, ఐసిడిఎస్ పిడి ఉమా, డి ఎల్ డి వో సువార్త, పర్యవేక్షకులు కె మనోరంజన్, ఏపిఎం బి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత వినికిడి యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం(ఆర్‌బిఎస్‌కె) దీన దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ద్వారా జిల్లాలో వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వినికిడి యంత్రాల పంపిణీ కార్యక్రమం ఈ నెల 25న ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (క్యాజువాలిటీ మిద్దెపై)లో జరుగుతుందని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భగీరథి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వినికిడి యంత్రాలు ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు రేషన్ కార్డు జెరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, గతంలో వినికిడి పరీక్ష చేయుంచుకున్న వారు వారి రిపోర్ట్స్ తీసుకొని రావాలన్నారు. ఉచిత వినికిడి యంత్రాలు కావాల్సిన వారు ఒంగోలు డిఇఐసి 08592 223355, రాము 9959286963, చాంద్ బేగం 9490266602 నెంబర్లకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సైబర్ నేరాల పట్ల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ప్రజలకు ఎస్‌పి దామోదర్ సూచన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నేషనల్/స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్, అసోసియేషన్, అనుబంధ సంస్థల అధికారులమని కాల్స్ చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తే సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కొందరు కేటుగాళ్లు హ్యూమన్ రైట్స్ పేరుతో ఫేక్ వెబ్‌సైట్లు, నకిలీ గుర్తింపు కార్డులు, సోషల్ మీడియా గ్రూపులు సష్టించి ప్రజల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు సేకరిస్తారన్నారు. ఆ సంస్థల అధికారులమని ఫోన్ చేసి ఏదైనా సేవల కోసం లేదా కేసును పరిష్కరించడానికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తారన్నారు. ఫలానా తప్పు చేశారని బెదిరించడం, మీపై కేసు నమోదు అయిందని వాయిస్/వీడియో కాల్ చేసి ముందుగానే సేకరించిన వివరాలన్నీ చెప్పి భయపెడతారన్నారు. ఈ కేసు నుండి బయటపడాలంటే కొంత నగదు బదిలీ చేయాలని ఆర్థిక నష్టాన్ని కల్గిస్తారన్నారు. హ్యూమన్ రైట్స్ సంబంధించి అసోసియేషన్, అనుబంధ సంస్థలు ఉండవని, ప్రజలు అలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బులు బదిలీ చేయాలన్నా, బ్యాంకు అకౌంట్ వివరాలు, ఇతర వ్యక్తిగత వివరాలు అడిగితే ఇవ్వొద్దని జిల్లా ఎస్‌పి సూచించారు. ఏదైనా సమాచారాన్ని నమ్మే ముందు, అది నిజమేనా కాదా నిర్ధారించుకోవాలని, అధికారిక వెబ్‌సైట్లు, విశ్వసనీయ మీడియాను మాత్రమే రిఫరెన్స్ చేయాలన్నారు. తెలియని వ్యక్తులు, వెబ్‌సైట్లకు వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదని, అన్ని అకౌంట్లకు విభిన్నమైన, స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్ ఉపయోగించాలని, అనుమానితమైన ఏదైనా విషయం గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. హ్యూమన్ రైట్స్ అనే పవిత్రమైన పదాన్ని దుర్వినియోగం చేసే మోసపూరితమైన వ్యక్తులను గుర్తించి, వారి మోసాలు, కుట్రలను అడ్డుకోవడం అందరి బాధ్యతని తెలిపారు. అవగాహన, అప్రమత్తతతో ఉండడం ద్వారా సైబర్ నేరాల నుండి తమను తాము రక్షించుకోవచ్చని జిల్లా ఎస్‌పి తెలియజేశారు.

మానవత్వం చాటుకున్న మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-ఒంగోలు

క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం అధికారిక కార్యక్రమం నిమిత్తం క్యాంపు కార్యాలయం నుంచి ఒంగోలుకు వెళుతున్న క్రమంలో మార్గమధ్యలో త్రోవగుంట వంతెనపై గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టడంతో, తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న ఓ వ్యక్తిని చూసిన మంత్రి వెంటనే తన కాన్వాయ్‌ను ఆపారు. హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి... క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. గాయపడిన వ్యక్తి బల్లికురవ మండలం, అంబడిపూడి గ్రామానికి చెందిన కొవ్వూరి కోటేశ్వరరావుగా స్థానికులు గుర్తించారు. వెంటనే అంబులెన్స్ పిలిపించి ఒంగోలు కిమ్స్‌కి తరలించారు. కిమ్స్ డాక్టర్లకు మంత్రి గొట్టిపాటి ఫోన్ చేసి, యాక్సిడెంట్ వివరాలు తెలిపి, క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం

ఆర్టీసీ డిపో మేనేజర్ సయనా బేగం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ సయనా బేగం బుధవారం కనిగిరి ఆర్టీసీ డిపోలోని ఆమె కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు మంచి సౌకర్యాలు అందిచడానికి ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కనిగిరి నుంచి ఒంగోలుకు అదనపు సర్వీస్‌లు నడపడం, మంచినీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి కృషి చేస్తానని తెలిపారు. ఉన్నతాధికారులకు ప్రయాణికుల, సిబ్బంది సమస్యలను తెలియపరచి డిపో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్తీక మాసంలో భక్తుల సౌకర్యార్థం కనిగిరి డిపో నుంచి పంచారామాలు అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోటకు సర్వీస్‌లు ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవంబర్ నెలలో ప్రతి ఆదివారం పంచారామాలకు, అరుణాచలంకు కనిగిరి నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

విద్యార్థిని అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

క్రీడాకారులకు రోటరీ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - చీరాల

సామాజిక సేవా కార్యక్రమాలలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు అన్నారు. ఇటీవల నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి క్రీడలలో చీరాల ప్రాంతానికి చెందిన యశ్వంత్ రాజు, మహాలక్ష్మి పాల్గొని బ్రాంజ్ మెడల్స్ సాధించటం జరిగింది. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులను మంగళవారం రోటరీ క్లబ్ సభ్యులు అభినందించారు. జాతీయ స్థాయిలో 39వ జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో జరుగనున్న పోటీలకు ఎంపిక కావటంతో వారిని ప్రోత్సహిస్తూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ ఇస్వర్ల బాబూరావు, బి.హేమంత్ కుమార్, దోగుపర్తి వెంకట సురేష్, మామిడాల శ్రీనివాసరావు, చీరాల కృష్ణమూర్తి, జివై.ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీఆర్ఏ మృతికి సంతాపం

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన వీఆర్ఏ మేకా సుబ్బారావు (84) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. తహశీల్దార్ రవి కుమార్ మృతునికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. నివాళి అర్పించినవారిలో డిటి మస్తాన్ రావు, ఆర్ఐ విష్ణు, సీనియర్ అసిస్టెంట్ భాస్కరారావు, వీఆర్వో వసంతరావు, మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-రేపల్లె

చేతివృత్తిదారులకు కార్పొరేషన్ల ద్వారా రుణాలను మంజూరు చేయాలని ఆ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిణి రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ వాగ్దానాలతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినప్పటికీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం చేయూత లేకపోవడంతో వృత్తిదారులు తమ వృత్తులను కొనసాగించలేక, దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేతి వృత్తులను కుల వృత్తులను ప్రోత్సహిస్తామంటూ 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసినప్పటికీ నయాపైసా నిధులు కేటాయించకుండా వృత్తిదారులను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులకు రుణాలను మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎబిఏయుసి నాయకులు బండారు శ్రీనివాసరావు, రమేష్, చేనేత వర్గాల చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-వేటపాలెం

క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, ఉత్సాహం కలిగిస్తాయని ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.హరిబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బిపిహెచ్ డిగ్రీ కళాశాలలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. టోర్నమెంట్లో విజేతలైన బర్ల అరుణ్ బూదటి మధుబాబు, శ్రీ రాఘవం సాయి తేజ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ కోడూరి ఏకాంబరేశ్వర బాబు, సెక్రెటరీ అండ్ కస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, ఆంధ్రకేసరి యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ దేవీ వరప్రసాద్, కమిటీ మెంబర్ సాయి సురేష్, ప్రిన్సిపాల్ గుద్దంటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అధ్వానంగా వైద్యశాల పరిసరాలు

వర్షపు నీటి నిల్వతో దుర్వాసన

ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, రోగులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండి పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. వాన నీరు బయటికి వెళ్లే మార్గం లేక ఆకులు, అలములు కుళ్ళిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వైద్యశాలకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పోరంబోకుగా ఉన్న ఈ స్థలాన్ని గతంలో కొందరు ఆక్రమించుకొని దీనిని వైద్యశాలకు దానంగా ఇచ్చారు. ఈ స్థలంలో వైద్యశాల నిర్మాణం జరగ్గా మరి కొంతభాగం ఖాళీ ప్రదేశంగా ఉంది. ఈ ఉన్న ఖాళీ భూమి లోతట్టు ప్రాంతంగా ఉండటంతో వర్షపు నీరు నిలబడి రోజులే కాకుండా నెలలు తరబడి నిల్వ ఉండి అటువైద్యశాల సిబ్బందికి, ఇటు వైద్యశాలకు వచ్చే రోగులకు తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుందని పలువురు వాపోతున్నారు. గ్రామం మొత్తం లోతట్టు ప్రాంతంగా ఉండటంతో వర్షాకాలంలో వర్షపునీరు గృహాల్లోని మురుగునీరు నెలలు తరబడి నిల్వ ఉండి దానిలో రకరకాల దోమలు వృత్తి చెంది పలు రకాల అంటువ్యాధులకు కారణం అవుతున్నాయి. దీని కారణంగా గ్రామంలో దశాబ్దాలు తరబడి ఫైలేరియా (బోదకాలు) వ్యాధి విజృంభించి అనేకమంది ఈ వ్యాధుల బారిన పడ్డారు. దీని నివారణకు అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యశాల పరిసరాల్లో నిల్వ ఉన్న వర్షపు నీరు

వైద్యశాలలో అందని సేవలు..

భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ సకాలంలో వైద్య సేవలు అందటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకరేమో ఆ గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరవుతూ ఉంటే మరొకరేమో ఒక గంట మాత్రమే ఓపి చూసి వెళ్ళిపోతూ ఉంటారు. గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేవారు వైద్యశాలలో ఓపితో సంబంధం లేదన్నట్లుగా ఉంటారు. మరొకరు మధ్యాహ్నం 12 గంటలకు దాటితే ఇంకెక్కడా కనిపించరు. 12 తర్వాత వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యులు లేకపోవడంతో పరీక్షలు చేయించుకోవడానికి ఎవరూ లేక వెను తిరుగుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌గా మాత్రమే కొనసాగుతుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి వైద్యశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు మళ్ళించేందుకు చర్యలు చేపట్టి వైద్యశాలలో వైద్యుల వ్యవహార శైలిని మార్పు చేసి రోగులకు ఉపయోగపడే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అయోడిన్ లోప రుగ్మతలపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అయోడిన్ లోప రుగ్మతలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సిడి నోడల్ అధికారి, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ భగీరధి పేర్కొన్నారు. ఒంగోలు రాంనగర్ హైస్కూలులో అయోడిన్ లోప వ్యాధుల నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోడిన్ లోప వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భగీరధి మాట్లాడుతూ అయోడిన్ లోపంతో చిన్నారులలో ఎదుగుదల లోపించడం, బుద్ధి మాంద్యం, పెద్దల్లో థైరాయిడ్ సమస్యలు వస్తాయని తెలిపారు. మనుషుల శారీరక పెరుగుదల, అభివృద్ధి, మానసిక వృద్ధి, గర్భస్థ పిండం, చిన్న పిల్లల్లో మెదడు ఎదుగుదలకు, తెలివితేటలకు అయోడిన్ దోహదపడుతుందన్నారు. గర్భవతులు తీసుకునే ఆహారంలో అయోడిన్ లేకపోతే మంద బుద్ధి, వినికిడి లోపం, మూగతనం వంటి సమస్యలతో పిల్లలు పుట్టవచ్చని తెలిపారు. కొన్ని సార్లు గర్భస్రావం కలిగే ప్రమాదం ఉంటుందన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలని, ఈ ఉప్పుకు త్వరగా ఆవిరయ్యే గుణం ఉంటుందన్నారు. ఎండ వేడిమి, గాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలని, అయోడిన్‌ను గాలి చొరబడని మూత ఉన్న డబ్బాలో నిల్వ చేయాలని సూచించారు. గర్భిణులకు గర్భస్రావం, తక్కువ బరువున్న పిల్లలు పుడతారని తెలిపారు. నివారణకు ప్రతి ఒక్కరూ అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, హెడ్ మాస్టర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భగీరథి

పట్టాలు ఇచ్చి ఆదుకోండి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోలలపూడి గ్రామస్తులు స్థానిక సర్పంచ్ మోరపాకుల సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మార్టూరు తహశీల్దార్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ మండల పరిధి లోని కోలలపూడి గ్రామానికి చెందిన 150 మంది రైతులు గత 40 సంవత్సరాలుగా సర్వే నంబర్ 260లో వ్యవసాయ భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. రీ సర్వేలో లోపాల వల్ల గ్రామానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ కంఠంలోని భూమి ప్రభుత్వ భూమి అని చూపడం వల్ల ఇళ్ల స్థలాలు కొనాలి అన్నా, అమ్మాలి అన్నా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించేలా తహశీల్దార్ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రేపల్లె

భూ సర్వేలో నష్టపోయిన రైతుల సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కారుమూరులో సర్పంచ్ గుడి రమాదేవి అంక సుబ్బారావు అధ్యక్షతన రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. భూ సర్వే వల్ల తమకు తక్కువ విస్తీర్ణం వచ్చిందని కొంతమంది రైతుల నుంచి 20 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. వాటిని పూర్తిగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈనెల 24న మండలంలోని పరిసపాడు గ్రామంలో, 26వ తేదీన ఆరవపల్లిలో గ్రామసభ జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఆర్.ఐ పెదలంక రాంబాబు, ఎలక్షన్ డీటీ నిరంజన్, వీఆర్వోలు, గ్రామ సర్పంచ్ గుడి రమాదేవి, జనసేన నాయకులు శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంగులూరు: మండలంలోని రేణింగవరం గ్రామంలో మంగళవారం జరిగిన రెవిన్యూ గ్రామ సభకు 15 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ పి.సింగారావు తెలిపారు. ఈ పదిహేను అర్జీలలో పొలం ఎక్కువగా నమోదైనవి నాలుగు, పొలం తక్కువగా నమోదు అయినవి నాలుగు, కొంతమందివి జాయింట్‌గా ఉన్నవి 4, పేరు మార్పు చేయాల్సినవి ఒకటి, ఫోటో మార్పు చేయాల్సినవి ఒకటి, కొనుగోలు, వారసత్వం మార్పు చేయాల్సినవి ఒకటి అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆదినారాయణ, మండల సర్వేయర్ సురేష్, టిడిపి నాయకుడు బొరెడ్డి ఓబుల్ రెడ్డి, రేణింగవరం సర్వేయర్ రాజా, వీఆర్వో సుమతి, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

రేపల్లెలో అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు

కారంచేడు: మండలంలోని కేశవరప్పాడు గ్రామపంచాయతీలో రెవిన్యూ సమస్యలపై మంగళవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా చీరాల ఆర్డీవో డి.అఖిల, తహశీల్దార్ అనిత పాల్గొన్నారు. ఈ సభలో మొత్తం 18 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి జాయింట్ స్థలాలు పార్టిషన్ గురించి, అలాగే కొత్తగా రిజిస్ట్రేషన్స్ అయినటువంటి స్థలాలు సంబంధించి అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సత్యనారాయణ గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్చూరు: రీ సర్వే పూర్తి అయిన గ్రామాల్లో సమస్యలు పరిష్కారంలో భాగంగా దేవరపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎండీ అల్తాఫ్, గ్రామ సర్పంచ్ కొరిటాల సురేష్, ఎంపీటీసీ కాపు రవి చంద్ర, మండల సర్వేయర్ ఐ.బాలాంజనేయులు, ఎంఆర్ఐ ఇంఛార్జి ప్రేమ్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు. గ్రామ రైతులు హాజరై తమ సమస్యలు అర్జీ రూపంలో ఇచ్చారు. మొత్తం 87 అర్జీలు వచ్చాయి. ఉమ్మడి భూమి సమస్యపై 27, మ్యుటేషన్ సమస్యపై ఒకటి, ఎల్పిఎం మిస్సింగ్ ఒకటి, తేడాలపై 58 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

నగరం: మండల పరిధిలోని పెద్దవరం గ్రామ సచివాలయంలో జరిగిన గ్రామసభలో రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వేపై జరుగుతున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలను తమ దృష్టికి అర్జీల రూపంలో ఇస్తే పరిష్కరిస్తామన్నారు. పెద్దవరంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో 6 అర్జీలు వచ్చాయని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ జి.నాంచారయ్య, డిప్యూటీ తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మి

పలు గ్రామాల్లో వరి పొలాలు పరిశీలన

ప్రజాశక్తి-బాపట్ల

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీ రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండలం బేతపూడి, వెదుళ్ళపల్లి గ్రామంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించి పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. నేల స్వభావం పంటస్థితిని బట్టి అధిక దిగుబడులకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు సూచించారు. వరి అక్కడక్కడ ఉల్లికోడు ఆశించిందని రైతులు తెలిపారు. వీటి నివారణకు వేప నూనె పిచికారీ చేసి నివారించుకోవచ్చన్నారు. వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ పంట యాజమాన్య పద్ధతుల్లో అధిక ఎరువులు వాడకూడదని, పురుగు ఉదృతి గమనించిన తర్వాత వ్యవసాయ అధికారులు సిఫార్సు చేసిన పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమములో గ్రామ రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నివారణకు సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

సామూహిక ఎలుకల నివారణకు మండలంలో రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఏడిఏ లక్ష్మి తెలిపారు. గ్రామాల వారీగా సామూహికంగా ఎలుకల నివారణకు చేపట్టనున్న యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి, ఎలుకల నివారణకు మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలకు హాజరు కావాలని కోరారు.

అద్దంకి: రాయితీపై శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మడలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీలో సాగు చేసే శనగ విత్తనాలపై ప్రభుత్వం 25 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. డీఏపీ, యూరియా కాంప్లెక్స్ ఎరువులు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి ఎస్.దీప్తి మాట్లాడుతూ బిందు, తుంపర సేద్య పరికరాలకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8 వేలు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు రాణి, కరిముల్లా, గుడుపూడి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: సామూహిక ఎలుకల నివారణకు ప్రతి రైతు కృషి చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.విజయ్ బాబు కోరారు. మంగళవారం గంగడి పాలెం, రాజుకాలువ గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 24 రైతు భరోసా కేంద్రాలలో ఎలుకలను నివారించే కార్యక్రమంలో భాగంగా ఎలుకల మందును అందుబాటులో ఉంచామని ప్రతి రైతుకు ఉచితంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. అన్ని గ్రామాల్లో రైతులు ఒకేసారి ఎలుకలను నివారించడానికి చర్యలు చేపట్టడం వల్ల మొత్తం ఎలుకలు చనిపోవడానికి అవకాశం ఉందన్నారు. రైతు భరోసా కేంద్రానికి వచ్చేటప్పుడు నూకలు నూనె తీసుకువస్తే విషపూరితంగా తయారుచేసి రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బేతపూడిలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కారంచేడు: రైతులు వ్యవసాయంలో పంటకు సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కారంచేడు వ్యవసాయ అధికారి కె.సుధీర్ బాబు అన్నారు. కారంచేడు మండల పరిధిలోని స్వర్ణ, కొడవలి వారి పాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ సిబ్బంది మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు స్థానిక రైతులకు వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పంటకు ఉపయోగించాల్సిన రసాయనాలను వివరించారు. వర్షపు నీరు పొలాలలో నిల్వంచకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొల్లూరు: కొల్లూరు మండలంలోని అన్ని వరి సాగు చేసిన గ్రామాలలో ఉచితంగా ఎలుకల నివారణ మందులు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వర్రావు తెలిపారు. సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని ఆయన కోరారు. కొల్లూరు మండలంలో మొత్తం 4,637 హెక్టార్లలో వరి పంట సాగు చేశారని తెలిపారు. రైతులందరూ సామూహికంగా ఒకేసారి ఒకేరోజు చేపట్టినట్లయితే సమర్థవంతంగా ఎలుకలను నిర్మూలించవచ్చునని ఆయన తెలిపారు. అనంతవరం చిలుమూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ప్రసాద్ వారి సిబ్బంది హాజరై లద్దె పురుగు ఇనుప ధాతువు నివారణ చర్యలను రైతులకు వివరించారు. పశువులకు వచ్చే వ్యాధులు వాటి నివారణకు రైతులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సూచనలు ఇచ్చారు.

వరి పొలాలను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరులో మంగళవారం జిల్లా ఆత్మ డీడీఏ సుబ్రమణ్యం, కేవీకే దర్శి కోఆర్డినేటర్ రమేష్, టిఆర్ఎస్ దర్శి వరప్రసాద్, వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్‌లు వరి పొలాలని సందర్శించారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వరిలో ఉల్లి కోడు ఉధృతిని గమనించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న దశలో ఎటువంటి ఎరువులు వాడకుండా ఉల్లికోడు ఉదృతనే తగ్గించే పురుగుమందులు వాడాలని సూచించారు. ముఖ్యంగా బెల్ట్ ఎక్స్పర్ట్ అనే ముందు ఎకరాకు 300 మిల్లి లీటర్లు లేదా పిప్రో నిల్ ఐదు శాతం అనే ముందు ఎగరాకు 400 మిల్లీలీటర్ల లేదా పోలీస్ అనే ముందును 100 గాడిద చొప్పున మార్చి మార్చి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఫరూక్, వీఏఏ శోభారాణి, బాల వెంకయ్య, ఎంసీఈవో దయాసాగర్ పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంతో ప్రయోజనం

ప్రజాశక్తి- పంగులూరు

పెరటి తోటల పెంపకంతో ఎంతో ప్రయోజనం ఉంటుందని ఐసిడిఎస్ కొరిశపాడు ప్రాజెక్ట్ సీడీపీవో కృష్ణకుమారి అన్నారు. పెరటి తోట పథకం కింద మంగళవారం మండలంలోని రేణింగవరం, కస్యాపురం, రామకూరు గ్రామాల్లోని పాఠశాలల వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రేణింగవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణకుమారి మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో పెరటి తోట ఉండటం మంచిదన్నారు. ఇంటి దగ్గరే కుటుంబంలోకి అవసరమైన ఆకుకూరలు కూరగాయలతో పాటు మంచి పండ్లను ఇచ్చే పండ్ల చెట్లను కూడా పెంచుకోవచ్చని తెలిపారు. పండ్ల మొక్కలు ఇంట్లో ఉంటే ఇంట్లో వారంతా ఆరోగ్యంగా ఉన్నట్టేనని ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరూ పండ్ల మొక్కలను పెంచాలని ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆమె కోరారు. టిడిపి నాయకులు బోరెడ్డి ఓబులరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రవేశపెడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పెరటి తోట పథకాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మామిడి, జామ, దానిమ్మ, సీతాఫలం, ఆకుకూరల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో అంగన్‌వాడీ ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్ కుమారి పాల్గొన్నారు.

రేణింగవరంలో మొక్కలు నాటుతున్న సీడీపీవో కృష్ణకుమారి

సభ్యత్వ నమోదుతో బీమా సౌకర్యం

ప్రజాశక్తి - రేపల్లె

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు జీవి నాగేశ్వరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26వ తేదీ నుండి డిసెంబర్ 31 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు కార్యకర్తలు అందరూ సహకరించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్తకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు పట్టణ అధ్యక్షులు జిపి రామారావు, నాయకులు సాయి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

ప్రజాశక్తి - రేపల్లె

పేదల ఆరోగ్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరమని రెవెన్యూ శాఖ మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళవారం టీడీపి కార్యాలయంలో అనారోగ్యానికి గురై చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి ద్వారా వైద్య ఖర్చులకు ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేశ్, టీడీపీ నాయకులు ఉన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-వేటపాలెం

పంచాయతీ సెక్రటరీలు పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో బొప్పిడి శివన్నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ హాల్లో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సెక్రెటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. డెంగ్యూ మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో ఎం.రాజేష్ బాబు ఈఓఆర్‌డి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు బడుగు రమేష్ బాబు, షేక్ గౌస్, మహమ్మద్ అలీ, నంపూర్ణ కుమారి, టి.వెంకటేశ్వరరావు, టి.మాల్యాద్రి రావు, బాలిగ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మృతి చెందిన రాజశేఖర్

రోడ్డు దాటుతున్న యువకుడిని కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద ఇడుపులపాడు కాటన్ మిల్లు ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. మార్టూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వలపర్ల గ్రామానికి చెందిన అందే రాజశేఖర్ (30) పెయింట్ పని చేస్తుంటాడు. తన బైక్‌పై చిలకలూరిపేట వెళుతూ జొన్నతాళి వద్ద ఐసీఎమ్ కంపెనీలో పని చేసే తన తండ్రిని కలవడానికి బైక్ అపి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుంటూరు నుంచి కడప వైపు వెళుతున్న కారు అతి వేగంగా రాజశేఖర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాల్లోకి ఎగిరి క్రింద పడి తీవ్రగాయాలతో రాజశేఖర్ మృతి చెందాడు. కళ్ళ ముందే కుమారుడుని కారు ఢీకొట్టడంతో తల్లడిల్లిపోయిన తండ్రి, స్థానికులు పరిశీలించగా అప్పటికే రాజశేఖర్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కారుని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - రేపల్లె

పేకాట స్థావరంపై రేపల్లె పట్టణ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. రేపల్లె పట్టణ సీఐ మల్లికార్జున రావుకు వచ్చిన సమాచారం మేరకు సింగుపాలెం గ్రామంలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు. పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

నేరాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లి గ్రామస్తులతో ఎస్ఐ అనిల్ కుమార్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దొంగతనాలపై, చెడ్డీ గ్యాంగ్ గురించి, పేకాట, కోడిపందాలు, జూదం వంటి ఆటలు ఆడడం వలన జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు.

హాస్టల్లో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి నిఖిల్ రెడ్డి

ప్రభుత్వ హాస్టల్లో తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం శింగరాయకొండ పరిధిలోని హాస్టల్‌ను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.నిఖిల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శింగరాయకొండ పరిధిలో ఉన్న వెనుకబడిన తరగతుల కళాశాల బాలికలు, బాలలు మరియు బి.సి.బాయ్స్ వసతి గృహాలను తనిఖీ చేసే క్రమంలో సిబ్బంది విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను, రికార్డులను, వైద్య పరమైన పర్యవేక్షణ, విద్యార్థులకు కేటాయించిన ఆహార పట్టిక అమలు వంటి పలు అంశాలను పరిశీలించారు. పిల్లలకు వండిన ఆహారం తానే స్వయంగా తిని పరీక్షించారు. ప్రధానంగా బీసీ బాలికల వసతి గహ పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళలో చీకటమయంగా ఉండటం గమనించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శింగరాయకొండ ఎస్ఐ బి.మహేంద్ర, ఏఎస్ఐ మహబూబ్ భాషా, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన శంకరన్

- పాలనలో నూతన శకానికి నాంది
- ప్రొఫెసర్ జె.హరగోపాల్
- ఎస్ఆర్ శంకరన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ పాలనలో నూతన శకానికి నాంది పలికిన యుగకర్త ఎస్ఆర్ శంకర అని హైదరబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జె.హరగోపాల్ అన్నారు. ఎన్నో కీలకమైన నిర్ణయాల్లో ఒక నిర్మాణాత్మకమైన సుపరిపాలనకు శ్రీకారం చుట్టిన శంకరన్ సివిల్స్ లో ఒక గొప్ప శ్రీ మంతుడుగా పేద ప్రజలకు సేవలు అందించారన్నారు. మంగళవారం ఎస్ఆర్ శంకరన్ జయంతి సందర్భంగా 'ప్రజాస్వామ్యం- సుపరిపాలన' అంశంపై ఎస్ ఆర్ శంకరన్ మెమోరియల్ బాపట్ల పౌరసమాఖ్య ఏర్పాటు చేసిన శంకరన్ స్మారక సెమినార్‌లో హరగోపాల్‌తో పాటు అనేకమంది విశ్రాంత ఐఎఎస్ అధికారులు ఎస్సార్ శంకరన్ తో ఉన్న అనుభవాలను ఈ సందర్భంగా పాలుపంచుకున్నారు. హరిగోపాల్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢవిల్లాలంటే శంకరన్ లాంటివాళ్ల సమాజానికి ఎంతో అవసరమనే సందేశాన్ని అందించారు.

మాట్లాడుతున్న హరగోపాల్

సుపరిపాలనపై ఆయన చేసిన ఆలోచనత్మక నిర్ణయాలు, వివరణాత్మక ఆశయాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక కీలకమైన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటంలో విఫలమైతే ప్రజలకు సుపరిపాలన అందే అవకాశమే లేదని, అనేక సందర్భాల్లో శంకరన్ బలంగా అభిప్రాయపడేవారన్నారు. ఇప్పటి పరిస్థితుల్లో శంకరన్ అందించిన కొన్ని సంస్కరణల ఫలితంగానే అనేక మార్పులు వచ్చాయని వెల్లడించారు. విశ్రాంత ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వచ్చిన మార్పు శంకరన్ అందించిన స్ఫూర్తి అనే పేర్కొనవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సుపరిపాలనలో ఒక మహత్తరమైన ఆలోచన విధానం శంకరన్‌తోనే ప్రారంభమైందని చెప్పారు. ప్రజల్లో చైతన్యం పెరగాలని, పూర్తిస్థాయి అవగాహన రావాలని, వాళ్ల భాగస్వామ్యంతోనే మంచి పాలన సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. దీనికోసం యువత ఆలోచన ప్రధానమైనదిగా పేర్కొన్నారు. ఎస్.ఆర్.శంకరన్‌తో కలిసి పనిచేసిన అనుభవం, ఆయనతో అనుబంధమున్న సందర్భాలు ఎంతో గొప్పగా ఉండేవని పలువురు విశ్రాంత ఐపిఎస్‌లు అన్నారు. ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఖచ్చితమైన సుపరిపాలన అమలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అవినీతి నిర్మూలన ప్రజా చైతన్యంతోనే సాధ్యపడుతుందన్నారు. అది జరిగిన నాడే సుపరిపాలనకు మార్గం సుగమమవుతుందన్నారు. సెమినార్ కు ముందు బాపట్ల కలెక్టరెట్లో శంకరన్ విగ్రహానికి భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఎస్. చక్రవర్తి రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ అస్థిరిస్ట్రేటివ్ స్టాఫ్ ఎస్.రమేష్‌కుమార్, కాలేజ్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మాజీ కార్యదర్శి ఆర్ సుబ్రహ్మణ్యం, ఎ.పి.హెచ్.ఆర్.డి.ఐ. మాజీ డైరెక్టర్ జనరల్లో చక్రపాణి, పౌర సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు కె.విజయకుమార్, శరత్ బోస్, శంకరం మెమోరియల్ ట్రస్టీలు పిసి సాయిబాబు, జి.వెంకటేశ్వర్లు, కరణం రవీంద్రబాబు పూలమాలలు వేసి.. నివాళు లర్పించారు. మానసిక నిరాశ్రయులకు మనో బందు అంబులెన్స్‌ను జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలసి విశ్రాంత ఐఎఎస్‌లు ప్రారంభించారు.

నోటీసులు ఇవ్వలేం.. ఆక్రమణలు తొలగించలేం..

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజాశక్తి కథనానికి స్పందన

'ప్రజాశక్తి'లో మంగళవారం ప్రచురితమైన 'అడ్డగోలుగా ఆనకట్టలు' శీర్షికన ప్రచురించిన కథనంపై జిల్లా ఇరిగేషన్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం.శివరామప్రసాద్ స్పందించారు. ఆనకట్టలకు తమ శాఖ నుంచి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాగుల్లో అక్రమ ఆనకట్టలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చే అధికారం గానీ, నిర్మాణాల తొలగింపు చర్యలు చేపట్టే అధికారం గానీ తమ శాఖ జేఈ, డిఈలకు లేదని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టే అధికారం పంచాయతీ రాజ్ శాఖ మరియు రెవిన్యూ శాఖలదేనన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆ విధమైన చర్యలు చేపడితే తమ శాఖ అధికారులు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని నివేదికలో తెలిపారు.

సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

- పంట నష్టం ఎన్యుమరేషన్ చేయాలని డిమాండ్
- డిప్యుటేషన్‌పై అంబులెన్స్ డ్రైవర్లు ఏర్పాటు చేయాలి
- ఆసుపత్రులలో మౌలిక వసతులు కల్పించాలి
- సమస్యలు పరిష్కరించాలని మంత్రులు ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రధాన సమస్యలపై ప్రజాప్రతినిధులు గళమెత్తారు. పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, డిప్యుటేషన్‌పై అంబులెన్స్ డ్రైవర్లను నియమించాలని, ఆసుపత్రులలో మౌలిక వసతులు కల్పించాలని వంటి ప్రధాన సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశంలో పాల్గొన్న మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటిరవికుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిదులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

డిఏపి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

రైతుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని డిఏపిను వ్యాపారులకు అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. తమకు అవసరమైన డిఏపి దొరకటం లేదని, అధిక ధరలు తీసుకుంటున్నారని రైతులు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన డిఏపి అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టి డిఏపి అధిక ధరలకు అమ్మే వ్యాపారులకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

మండల స్థాయిలో సదరం క్యాంపులు

వికలాంగ సర్టిఫికెట్ల కోసం మండల స్థాయిలో సదరం క్యాంపులు నిర్వహించేం దుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అధికారులను ఆదేశించారు. గ్రామ సభలు నిర్వహించి పెన్షన్ల ఎంపిక జరగాలని, అనర్హులకు పింఛన్ల పంపిణీపై ఆడిట్ నిర్వహించాలన్నారు. జిల్లా కేంద్రంలో సదరం క్యాంపులు నిర్వహిస్తుంటే 100 శాతం వికలాంగత్వం ఉన్న వారు రాలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్టిపికెట్ల జారీలో వైద్యుల అలసత్వంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. అనర్హు లకు పింఛన్లు దక్కటం అర్హులు నిరాశ చెందుతున్నారని, తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

నరేగాలో క్రీడామైదానాల అభివృద్ధి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్యే కంచర్ల శ్రీకాంత్ కోరారు. గతంలో ఎన్ఆర్ఇజిఎస్‌లో క్రీడామైదానాల అభివృద్ధి, పొలాలకు మట్టి తోలి లెవలింగ్ చేపట్టారన్నారు. మంత్రి డిబివి స్వామి స్పందిస్తూ ఉపాధి హామీ పథకంలో క్రీడామైదానాల అభివృద్ధి, ఎస్సి, ఎస్టి కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్ కుమార్‌ను ఆదేశించారు.

మెగా వాటర్ షెడ్స్ ఏర్పాటు చేయాలి

పశ్చిమ ప్రకాశంలో మెగా వాటర్ షెడ్స్ ఏర్పాటు చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కోరారు. పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు అడుగంటాయని, ప్రజలు ఫ్లోరిన్ జలాలు తాగాల్సి వస్తుందన్నారు. ఏయే ప్రాంతాలలో భూగర్భ జలాలు అడుగంటాయో సర్వే చేసి అక్కడ మెగా వాటర్ షెడ్స్ ఏర్పాటుతో భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా మార్కాపురం ఆసుపత్రిలో ఐసియు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న ప్రమాదం జరిగితే ఒంగోలు సిఫారసు చేస్తున్నారన్నారు. ఐసియు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని కోరారు.

వైద్యులు, సిబ్బంది పోస్టులను క్రమబద్దీకరించాలి

కనిగిరి వైద్యశాలలో వైద్యులు, ఇతర పారా మెడికల్ సిబ్బంది పోస్టులను క్రమబద్దీకరించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి మంత్రులను కోరారు. ఆసుపత్రిలో ఇద్దరు అనస్తీషియన్స్ ఉంటే ఒకరిని పామూరుకి డిప్యుటేషన్‌పై పంపారని, ఒకరే ఉండటం, ఆ డాక్టర్ సెలవు పెడితే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నర్సులను సైతం డిప్యుటేషన్‌పై పంపుతున్నారన్నారు. ఆసుపత్రికి అంబులెన్స్ ఉన్న డ్రైవర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డిప్యుటేషన్‌పై డ్రైవర్‌ను నియమించాలని కోరారు.

డిప్యుటేషన్‌పై డ్రైవర్‌ను నియమించాలి

గిద్దలూరు ఆసుపత్రిలో అంబులెన్స్ ఉందని, డిప్యుటేషన్‌పై డ్రైవర్‌ను నియమించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కోరారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహణ సరిగా లేదని, వర్షం పడితే ఆసుపత్రిలో లీకేజీ వస్తుందన్నారు. ఆసుపత్రిని కట్టి అప్పగించే సమయంలో అవసరమైన పైపులు వేయలేదని, వైద్యాధికారులు ఏమీ చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి స్పందిస్తూ వర్షపు నీటితో లీకేజీలు ఏర్పడినప్పుడు హెచ్‌డిసి నిధులతో కాకపోతే మరో రూపంలో వాటిని సరిచేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

గ్రామాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ స్తంభాల సమస్యలు, త్రి ఫేజ్ సమస్యలు నెలకొన్నాయన్నారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందిస్తూ ప్రజల అవసరాల దృష్ట్యా విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, బాపట్ల జెసి ప్రకార్ జైన్, జడ్పీ సిఇఒ బి.చిరంజీవి, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందినవ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిర్చి పంట ఎన్యుమరేషన్ చేయాలి

నియోజకవర్గంలోని ముండ్లమూరు అగ్రహారంలో మిర్చి పంట 10 వేల ఎకరాలలో మిర్చి పంట దెబ్బతిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట ఎన్యుమరేషన్ చేపట్టాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు. సజ్జ, మినుములు, అలసందలు వం టి పంటలకు నష్టం వాటిల్లిందని, ప్రభు త్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

బూచేపల్లి, దామచర్ల కరచాలనం

నీరు - చెట్టు బిల్లులు చెల్లించాలి

గత టిడిపి ప్రభుత్వ హయాంలో నీరు-చెట్టు పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు కోరారు. కాంట్రాక్టర్లు ఎవరూ నష్టపోకూడదని, ప్రాధాన్యతా క్రమంలో బిల్లుల చెల్లింపుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి కార్యాలయం లో సిఎం ఫొటో ఉండాలన్నారు.